జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
భద్రాద్రి కొత్తగూడెం
మంగళవారం | 7 | అక్టోబర్ | 2025 ◆ పేజీలు : 6



## జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణకు నోడల్ అధికారుల నియామకం

- జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్




**కొత్తగూడెం కలెక్టరేట్, అక్టోబర్ 6, ప్రజాజ్యోతి:** తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషన్, హైదరాబాద్ ఆదేశాల మేరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో జరగబోయే జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలను పారదర్శకంగా, నిర్వహించేందుకు వివిధ విభాగాల నోడల్ అధికారులను నియమించామని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ సోమవారం తెలిపారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియలో ప్రతీ దశలో సమన్వయంతో పనిచేసి, విధి నిర్వహణలో ఎలాంటి లోటుపాటులు లేకుండా చూసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.జిల్లా స్థాయిలో వివిధ కార్యకలాపాలకు

మిగతా 2 లో...



## రిజర్వేషన్ కన్ఫ్యూజన్‌తో...
# ఎన్నికల కాలయాపన

- 42 శాతం బీసీ రిజర్వేషన్లపై సందిగ్ధత
- న్యాయస్థానాల తీర్పుపై ఉత్కంఠ
- ఆశావాహుల్లో కనరాని ఉత్సాహం
- అధికార యంత్రాంగం సిద్ధంగా ఉన్నా..
- రాజకీయ స్పష్టత లేని పరిస్థితి!?

రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగాల్సిన సమయం చాలా దాటి పోయింది. మండల, జిల్లా ప్రజా పరిషత్ లు, గ్రామపంచాయతీలు వీటి పదవీకాలం ముగిసి సంవత్సరం దాటినా కూడా ఎన్నికల దిశగా ఎటువంటి స్పష్టత కనిపించడం లేదు. కాంగ్రెస్స్ ప్రభుత్వం ఏర్పడి రెండో సంవత్సరం చివరి దశలో ఉన్నా, స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయో అనే ప్రశ్నకు సమాధానం దొరకలేదు. ఈ అనిశ్చితికి ప్రధాన కారణం బీసీలకు కేటాయించిన 42 శాతం రిజర్వేషన్ల అంశమే అని చెప్పాలి. ప్రభుత్వ హడావిడి చేసి ఎన్నికల ప్రక్రియకు కమిషన్ తో తేదీలు నిర్ణయించిన.. రిజర్వేషన్ అంశంపై కోర్టులో పిటిషన్ ఉండడంతో ఎన్నికల కాలయాపన ఇంకా కొనసాగుతూనే ఉంది.



6 లో..

● భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి / అశ్వారావుపేట, ప్రజాజ్యోతి

## రామున్ని చూసి తరించిన ధన్యజీవి శబరి

- నేడు భద్రగిరిలో శబరి స్మృతి యాత్ర
- ఏర్పాట్లు చేసిన దేవస్థానం అధికారులు
- ఉమ్మడి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి గిరిజనులను ప్రత్యేక బస్సుల్లో రప్పిస్తున్న దేవస్థానం



**భద్రాచలం, అక్టోబరు 6, ప్రజా జ్యోతి:** భద్రాచలం శ్రీ సీతా రామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో మంగళ వారం శబరి స్మృతి యాత్ర నిర్వహించనున్నారు. శబరి వాల్మీకి రామాయణంలో మాతంగ మహర్షి ఆశ్రమంలో పరిచారకగా మహర్షులకు సేవలందిస్తూ ఉంటుంది. ఈసమయంలో సీతాన్వేషణలో భాగంగా ఆశ్రమంకు వచ్చిన రామలక్ష్మణులకు రుచికరమైన పండ్లు అందిస్తూ రాముని అనుగ్రహంతో ముక్తిని పొందిన

మిగతా 2 లో...

## స్థానిక సంస్థల ఎన్నికల్లో
# బీ ఆర్ఎస్ గెలుపే లక్ష్యం

- అధ్యక్షుడు రేగ కాంతారావు



**ఆళ్ళపల్లి.అక్టోబర్ 6.ప్రజా జ్యోతి:** సోమవారం ఆళ్ళపల్లి మండలం. మర్కోడు పంచాయతీ బీ ఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా బిఆర్ఎస్ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు రేగ కాంతారావు పిలుపునిచ్చారు ఈ సందర్భంగా గ్రామంలో ముఖ్యంగా నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ ఒక్క హామీ అమలు చేయకుండా ప్రజలను దగా చేసిందన్నారు. ప్రభుత్వం ఏర్పాటైన రెండు సంవత్సరాల్లోనే ప్రజా వ్యతిరేకతను మూటగట్టుకుందన్నారు. టిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విడుదల చేసిన కాంగ్రెస్ బాకీ కార్డును ప్రతి ఇంటికి చేరవేసి

మిగతా 2 లో...

# అందరివాడు ఈర్ని గీత కృష్ణ మోహన్

**చర్ల, అక్టోబర్ 06:(ప్రజా జ్యోతి ):** తెలంగాణలో అందరూ ఎదురుచూస్తున్న స్థానిక సంస్థల ఎన్నికల నగారా మోగడంతో తెలంగాణతోపాటు చర్ల మండలంలో కూడా ఎన్నికల హడావుడి మొదలైనది .ఈ క్రమంలో చర్ల మండల బిఆర్ఎస్ పార్టీ జడ్పిటిసి అభ్యర్థిగా ఈర్ని గీతాకృష్ణ మోహన్ ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగినది.చర్ల మండలంలో ఈర్ని కుటుంబం గురించి తెలియని వారంటూ ఎవరు ఉండరు ఈర్ని కుటుంబం యొక్క సేవా గుణం వారి తాత ముత్తాతల నుండి ఆనవాయితీగా వస్తున్న విషయం అందరికి తెలిసినదే 1960వ సంవత్సరంలో ఈర్ని లక్ష్మీనారాయణ, ఈర్ని మహేశ్వరరావులు చర్ల మండలంలో మొట్టమొదటి కిరాణా కొట్టు పెట్టి వ్యవసాయం చేస్తూ ఆపదలో ఉన్న వారికి తమదైన శైలిలో ఆదుకుంటూ వారిని ప్రోత్సహించేవారు. తరువాత వారి తదనంతరం ఈర్ని నాగరాజు అదే ఆనవాయితీని కొనసాగిస్తూ తన వద్దకు వచ్చిన వారికి సహాయం చేస్తూ ముందుకు వెళ్లేవారు. ఈర్ని ఆదినారాయణ,ఈర్ని వెంకటరమణలు కూడా పెద్దల నుండి



వచ్చిన సేవాగుణాన్నీ కొనసాగిస్తూ పేద ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్నారు .ఈర్ని ఆదినారాయణ, వెంకటరమణ కుమారుడైన ఈర్ని గీతా కృష్ణమోహన్ వారి తాత ముత్తాతల నుండి తల్లిదండ్రుల నుండి వచ్చిన సేవా గుణాలను తమదైన శైలిలో కొనసాగిస్తూ పేద ప్రజలకు ఆపన్న హస్తం అందిస్తూ ముందుకు సాగుతున్నారు . చర్ల మండలంలో ఈర్ని కుటుంబానికి ప్రత్యేకమైన స్థానం ఉన్నది అటువంటి కుటుంబంలో జన్మించిన ఈర్ని గీత కృష్ణ మోహన్ బిటెక్ చేసిన విద్యావంతుడు సహనశీలి,మృదుస్వభావి ఆపదలో ఉన్న వారికి సహాయం చేసే మనసున్న మనిషి ప్రభుత్వ కార్యాలయాల అవసరాలకు తమ సొంత స్థలాలను ఇవ్వడం, పేద విద్యార్థులకు చేయూతనివ్వటం మండలంలోని సమస్యలకు తమదైన శైలిలో స్పందించటం అభివృద్ధికి సహాయ పడటం చిన్న పెద్ద తేడా లేకుండా అందరినీ సమాన దృష్టితో చూడటం వారి అభివృద్ధికి అవసరమైన అవకాశాలు కల్పించడంలో ఈర్ని కృష్ణ మోహన్ కి సాటె లేరు. దేవాలయాల అభివృద్ధిలో కూడా ఈర్ని గీతా కృష్ణమోహన్ ఎనలేని కృషి చేస్తూ వాటి అభివృద్ధికి కూడా సాయం చేస్తున్నారు. ఎదుటివారికి సహాయం చేయాలన్న తనతో పాటు తన సహచరులను కూడా అభివృద్ధిలోకి తీసుకెళ్లడానికి చేయూతనిచ్చే గుణం ఈర్ని కిట్టు సొంతం అనేక స్వచ్ఛంద సంస్థలకు ప్రత్యక్షంగా పరోక్షంగా సహకారం అందిస్తున్న విషయం చర్ల మండల వాసులందరికీ తెలిసినదే అటువంటి సహనశీలి ధైర్యవంతుడైన,విద్యావంతుడు ఐన ఈర్ని కృష్ణ మోహన్ కి చర్ల మండల బిఆర్ఎస్ పార్టీ జడ్పిటిసి అభ్యర్థిగా నిలబెట్టడం చర్ల మండల వాసులకు ఆనందాన్ని చేకూర్చే విషయం. 25 సంవత్సరాల తరువాత స్థానిక ఎన్నికలలో ఒక బీసీకి పోటీ చేసే అవకాశం వచ్చినందున విద్యావంతుడు సేవా తత్పరుడు బీసీ అయినటువంటి ఈర్ని కృష్ణమోహన్ ఎన్నికల బరిలో ఉన్నారు కావున మండలవాసులు అత్యధిక మెజారిటీతో ఈర్ని గీత కృష్ణ మోహన్ ని గెలిపించుకున్నట్లయితే పదవిలో లేనప్పుడు చేసిన కార్యక్రమాలు పదవి ఉన్నప్పుడు మరింతగా సేవ చేసి ప్రజలకు చేదోడు వాదోడుగా ఉంటారని ఈ అవకాశాన్ని వదులుకున్నట్లయితే మళ్లీ ఎన్ని సంవత్సరాలకి బీసీ అభ్యర్థిని గెలిపించుకునే అవకాశం ఉంటుందో మనకి తెలియదు కాబట్టి మండల వాసులు గీతా కృష్ణమోహన్ ను అత్యధిక మెజారిటీతో ఓటు వేసి బిఆర్ఎస్ పార్టీని కారు జోరుని కొనసాగించాలని బిసి అభ్యర్థికి ఘనవిజయాన్ని అనిదించాలని మండల వాసులను కోరుతున్నారు. ఎన్నికలలో బిఆర్ఎస్ పార్టీకి కారు గుర్తుని కేటాయించటం, చర్ల మండలంలో బిఆర్ఎస్ పార్టీ దొడ్డి తాతారావు ఆధ్వర్యంలో కారు జోరుని కొనసాగించటం మండలంలో బిఆర్ఎస్ పార్టీ విజయం సాధించేలా మండల ప్రజలను కోరుతున్నారు .

## రాముని చూసి తరించిన ధన్యజీవి శబరి

(మొదటి పేజీ తరువాయి...)

మహా సాధ్విగా గిరిజనురాలైన శబరికి పేరుంది. ఆమెను స్మరిస్తూ ప్రతి ఏటా ఆశ్వయుజ పౌర్ణమి రోజున శబరి స్మృతి యాత్రను దేవస్థానం వారు నిర్వహిస్తున్నారు.జూలూరుపాడు, ఏపీలోని కూనవరం, వి ఆర్ పురం, చింతూరు మండలాల నుంచి దేవస్థానం తరపున బస్సులను ఏర్పాటు చేసి గిరిజనులను రప్పించారు.

### ››› ఉత్సవం సాగేదిలా....

మంగళవారం ఉదయం గిరిజనులు తెచ్చిన పలు రకాల ఫలాలు, పూలతో రామచంద్రమూర్తికి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారు. అనంతరం భద్రగిరి ప్రదిక్షణ, కల్యాణోత్సవం, అనంతరం గిరిజనులు తీసుకొచ్చిన ఫలాలతో అర్చన, మంత్రపుష్పంతో శబరి స్మృతి యాత్ర నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాన్ని 2013 అక్టోబరు 18న అప్పటి స్పెసిఫైడ్ అథారిటీ చైర్మన్ వినోద్కుమార్ అగర్వాల్ ప్రారంభించారు. అప్పటి నుంచి గత 12 ఏళ్లుగా దేవస్థానం వారు ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తూ వస్తున్నారు.

### ››› భద్రాచలం చేరుకుంటున్న గిరిజనులు

సోమవారం గిరిజనులు తీసుకొచ్చేందుకు దేవస్థానం ఈవో కె.దామోదర్రావు ప్రత్యేక బస్సులను భద్రాచలం నుంచి వాజేడు,వెంకటాపురం,కూనవరం,వీఆరురం, అశ్వారావుపేట, జూలూరుపాడులకు ప్రత్యేక ఆర్టీసీ బస్సులను పంపారు. ఆ బస్సుల్లో గిరిజనులు సాయంత్రంకు భద్రాచలం చేరుకున్నరు. వీరికి దేవస్థానం ప్రత్యేక వసతి, భోజన, అల్పాహారం సౌకర్యాం ఏర్పాటు చేసింది. అలాగే మంగళవారం ఉత్సవం అనంతరం అన్నదానం చేసి మళ్లీ వారిని వారి గ్రామాల్లో దింపేందుకు ఆర్టీసీ బస్సుల్లో పంపనున్నారు.

## జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నిర్వహణకు నోడల్ అధికారుల నియామకం

(మొదటి పేజీ తరువాయి...)

నోడల్ అధికారులను నియమించామన్నారు, నోడల్ అధికారుల వివరాలను వెల్లడిస్తూమానవ వనరుల నిర్వహణకు బి.నాగలక్ష్మి ,జిల్లా విద్యా అధికారి.బ్యాలెట్ బాక్స్‌ల నిర్వహణ కు జె. నరేందర్, జిల్లా మార్కెటింగ్ అధికారి.రవాణా నిర్వహణ కు వెంకట రమణ, జిల్లా రవాణా అధికారి. శిక్షణ కార్యక్రమాల నిర్వహణ కు కె. శ్రీరామ్, జిల్లా ఉపాధి అధికారి , సాయి కృష్ణ, సబ్జెక్ట్ అసిస్టెంట్, విద్యా శాఖ.సామగ్రి నిర్వహణకు జి. దినేశ్ కుమార్, సహాయ సంచాలకుడు (మైన్స్ అండ్ జియాలజీ) , వై.టి.టి.వి. రమణ రావు, అకౌంట్స్ ఆఫీసర్, జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయం. ఎంసీసీ ఎన్నికల వ్యయ పర్యవేక్షణకు ఎం. విద్యా చందన, (ఎల్.బీ.) జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి (డీఆర్‌డిఏ). వ్యయ గణాంకాల సేకరణకు – కె. సంజీవరావు, జిల్లా ప్రణాళిక అధికారి. అభ్యర్థుల ఖర్చు లెక్కల పర్యవేక్షణకు – జి. శ్రీనివాస్, జిల్లా ఆడిట్ అధికారి. ఫ్లయింగ్ స్క్వాడ్‌లు , డేటా పర్యవేక్షణకు – మధుసూదన్ రెడ్డి, పరిశ్రమల జనరల్ మేనేజర్. మోడల్ కోడ్ ఉల్లంఘన కేసుల పరిశీలనకు – ఎం. శ్రీనివాస్ చౌదరి, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్, స్పెషల్ బ్రాంచ్. చట్టపరమైన కేసుల నమోదు చర్యలకు – శ్రీ చి. శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్, స్పెషల్ బ్రాంచ్. ఎన్నికల వ్యయ పర్యవేక్షణ నోడల్ అధికారి ఎ. శ్రీనివాస్, జిల్లా సహకార అధికారి. ఆబ్జర్వర్ల సమన్వయానికి ఎస్. త్రినాథ్ బాబు, జిల్లా మేనేజర్, సివిల్ సప్లైస్. బ్యాలెట్ పేపర్ ముద్రణ , పోస్టల్ బ్యాలెట్ పంపిణీకి వి. బాబు రావు, జిల్లా వ్యవసాయ అధికారి. మీడియా కమ్యూనికేషన్ ,సమాచార ప్రసారానికి మొహమ్మద్ అజ్గర్ హుస్సేన్, జిల్లా పౌర సంబంధాల అధికారి. హెల్ప్‌లైన్ , ఫిర్యాదుల పరిష్కారానికి శ్రీరామ్ సుశీల్ కుమార్, జిల్లా ఇన్ఫర్మాటిక్స్ అధికారి. రిపోర్టులు , నివేదికల సమర్పణకు బి. నాగలక్ష్మి , సీఈఓ, జిల్లా పరిషత్; కె. చంద్రశేఖర్, ఉప సీఈఓ, జిల్లా పరిషత్. వెబ్‌కాస్టింగ్ పర్యవేక్షణకు జె. సైదేశ్వర రావు , ఈ–డీఎం, భద్రాద్రి కొత్తగూడెం.హెచ్. వెంకటేశ్వరరావు, జిల్లా ఇంటర్మీడియట్ విద్యా అధికారులను నియమించినట్లు వెల్లడించారు, నోడల్ అధికారులు అందరు ఎన్నికల నిర్వహణలో క్రమశిక్షణతో,సమయపాలనతో పనిచేసి,రాష్ట్ర ఎన్నికల కమిషన్ సూచనలను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు. ప్రజాస్వామ్య ప్రక్రియను శాంతియుతంగా, నిర్వహించేందుకు ప్రతి ఒక్కరు తమ బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తించాలని కలెక్టర్ ఆదేశించారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో బీ ఆర్ఎస్ గెలుపే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి...)

ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించి, టిఆర్ఎస్ అభ్యర్థులు గెలిచేలా కృషి చేయాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు టిఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించి కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి కొమరం హనుమంతరావు మాజీ ఎంపీపీ కొండు మంజు భార్గవి పిఏసిఎస్ చైర్మన్ గుగ్గల మామయ్య మండలాధ్యక్షుడు వాయం నరసింహారావు ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, కిషోర్ బాబు పొదిల రాము నరసింహారావు శంకర్ బాబు వెంకటకృష్ణ ఆదాం సందీప్ నరేష్ సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## యువతి ఫోన్‌ను తక్షణమే వెతికిచ్చిన రూరల్ ఎస్ఐ బి. సురేష్

**పాల్వంచ (రూరల్), అక్టోబర్ 6 (ప్రజా జ్యోతి ):** పాల్వంచ రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ బి. సురేష్ చొరవతో ఒక యువతికి పోయిన మొబైల్ ఫోన్ తిరిగి లభించింది.వివరాల ప్రకారం యానంబైలు గ్రామానికి చెందిన కుంజా అర్చన సోమవారం పాల్వంచ నుండి తన గ్రామానికి




ఆటోలో ప్రయాణిస్తుండగా మొబైల్ ఫోన్ పోగొట్టుకుంది.ఈ విషయం పై పాల్వంచ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా,ఎస్ఐ సురేష్ వెంటనే స్పందించి మొబైల్ లొకేషన్ ఆధారంగా శోధించి తక్కువ సమయంలోనే ఫోన్‌ను గుర్తించి బాధితురాలికి అందజేశారు.తన ఫోన్ తిరిగి అందించినందుకు అర్చన పోలీసు అధికారులకు ధన్యవాదాలు తెలిపింది.

## తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో ఇసుక రవాణా నిర్వహించిన కఠిన చర్యలు తప్పవు

- ఎఫ్ ఆర్. ఓ.. కిరణ్ కుమార్





**ఆళ్ళపల్లి అక్టోబర్ 6,ప్రజాజ్యోతి:** మండల అనంతగు తనిఖీ నిర్వహిస్తుండగా . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనుమతులు లేకుండా తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో అక్రమంగా ఇసుక రవాణా అనేది చట్ట విరుద్ధమని వారు తెలిపారు. అక్రమంగా ఇసుక రవాణా చేసిన, అక్రమ ఇసుక దందా నిర్వహించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ళ కూపన్లలోపేరిట ఉన్నటువంటి కాలపరిమితిలో మాత్రమే ఇసుక రవాణా చేయాలని వారు తెలిపారు. ఖచ్చితంగా తాసిల్దార్ అనుమతులతోనే ఇసుక రవాణా చేయాలి లేనిచో వారిపై శాఖా పరమైన చర్యలు తప్పవని వారు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో వారి సిబ్బంది పాల్గొన్నారు

## ఆకాంక్షిత జిల్లా అభివృద్ధి పై కేంద్ర ప్రభారి అధికారిసోలామన్ అరోకియా రాజ్ సమీక్షా

**కొత్తగూడెం కలెక్టరేట్, అక్టోబర్ 6, ప్రజా జ్యోతి:** ఆకాంక్షిత జిల్లా అభివృద్ధి కార్యక్రమాల అమలు స్థితిని సమీక్షించేందుకు కేంద్రప్రభారి అధికారి సోలామన్ అరోకియా రాజ్ , అదనపు కార్యదర్శి, ఆర్థిక వ్యవహారాల శాఖ, సోమవారం జిల్లా లో పర్యటించారు ఈ పర్యటనలో భాగంగా ఆయన జిల్లా ప్రధాన కేంద్రాలు, పాఠశాలలు, ఆరోగ్య కేంద్రాలు, వ్యవసాయ, మహిళా ,ఇతర అభివృద్ధి సంబంధిత కేంద్రాలను పరిశీలించారు, అనంతరం ఐడిఓ సి కార్యాలయం సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివిధ శాఖల్లో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని వివరించారు. విద్యా రంగంలో ప్రతి పాఠశాలలో మౌలిక సదుపాయాలు పర్యవేక్షణతో అందించడం, పాఠశాలల్లో ఔషధ మొక్కల పెంపకం, విద్యా ప్రమాణాలను పెంపొందించే చర్యలు చేపట్టడం వంటి విషయాలను కలెక్టర్ వివరించారు.ఆరోగ్య రంగంలో తల్లి–పిల్లల ఆరోగ్యం, నూతన బ్లడ్ బ్యాంకుల స్థాపన, ఆధునిక వైద్య పరికరాల సమకూర్పు, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం మేళవించిన వైద్య సేవల కల్పనపై ప్రత్యేకంగా దృష్టి పెట్టినట్లు తెలిపారు. వ్యవసాయ రంగంలో మునగా, వెదురు అజోల్ల, పుట్టగొడుగుల సాగు, చేపల పెంపకం యూనిట్లు, బయోచార్ తయారీ ఫామ్ పౌండ్ల నిర్మాణం వంటి పథకాల అమలు, అశ్వరావుపేటలో జీవ వనరుల కేంద్రం ఏర్పాటు , మహిళా సంఘాల అభివృద్ధికి కల్పిస్తున్న సదుపాయాలపై తెలియజేశారు.అనంతరం కేంద్రప్రభారి అధికారి సోలామన్ ఆరోకియా రాజ్ ఐఏఎస్ మాట్లాడుతూ ప్రతి శాఖ నిరంతరం పర్యవేక్షణ, సమగ్ర సమన్వయంతో అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా అమలు చేయాల్సిన అవసరం ఉందన్నారు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఒక ఆకాంక్షిత జిల్లా కాబట్టి, ప్రతి అభివృద్ధి సూచికపై సమగ్ర దృష్టి పెట్టి, ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచే విధంగా కార్యాచరణ కొనసాగించాల్సినదని అన్నారు, ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, సిపిఓ సంజీవరావు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, జిల్లా వైద్య శాఖ అధికారి జయలక్ష్మి , మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి స్వర్ణలత లెనినా, ఎల్ డి ఎం రామ్ రెడ్డి, ఉద్యానవన శాఖ అధికారి కిషోర్, పంచాయతీ రాజ్ ఈఈ శ్రీనివాసరావు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ బాకీ కార్డును ఓటర్కు అందజేస్తాం

- కాంగ్రెస్ మాయ మాటలకు మళ్లీ మోసపోవద్దు
- టిఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పని చేస్తా: రేగా కాంతారావు.



**గుండాల. ప్రజా జ్యోతి 6.** టిఆర్ఎస్ పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేస్తానని టిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రేగ కాంతారావు అన్నారు సోమవారం మండల కేంద్రంలోని ముఖ్య కార్యకర్తల సమావేశం ఉద్దేశించి ఆయన మాట్లాడారు కాంగ్రెస్ పార్టీ మోసాలను ఎండగడుతూ బాకీ కార్డులను ప్రజల్లోకి తీసుకెళ్లి కుట్రను బట్టబయలు చేస్తామని ఆయన విమర్శించారు ఆరు గ్యారంటీలు 420 హామీలు వట్టి మాటలేనని హామీలు అమలు మరచి మళ్లీ ఈ ముఖంతో ఓటరు ఓటు అడుగుతారు వారికి తెలియాలన్నారు రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు ప్రజలకు వివరిస్తామన్నారు 20 నెలల అభివృద్ధి ఏమైందో ఎమ్మెల్యేలు చెప్పాలన్నారు టిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి పొలాలే నేడు ప్రజల అనుభవిస్తున్నారన్నారు పినపాక నియోజకవర్గం లో తీసుకువచ్చిన అభివృద్ధి నిధులను ఇప్పుడున్న ఎమ్మెల్యే క్యాన్సిల్ చేశారని 20 నెలలు గడిచిన చెప్పుకునే అభివృద్ధి కానరావడం లేదన్నారు టిఆర్ఎస్ పార్టీ చేసిన అభివృద్ధిని చేసిన పనులను ప్రజల ముందు ఉంచాలని ప్రతి కార్యకర్త క్రమశిక్షణతో అభ్యర్థి గెలుపు కోసం పనిచేయాలని కోరారు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్త తీసుకోవాలన్నారు ప్రజలను వారి మోసాల నుండి ఇప్పటికైనా బయటికి తీసుకురావాలన్నారు ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు తెల్లం భాస్కర్ రవీందర్ రెడ్డి మోకాళ్ళ వీరస్వామి తిరుకొండూరి రాము గడ్డం వీరన్న హజ్జు నిట్ట రాములు ప్రభాకర్ బుచ్చి రాములు తదితరులు పాల్గొన్నారు.

## సాత్వికను అభినందించిన కమిషనర్ సుజాత



**కొత్తగూడెం, అక్టోబర్ 6 (ప్రజాజ్యోతి ):** కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ లో పనిచేస్తున్న స్నేక్ రెస్క్యూ స్పెషలిస్ట్ సంతోష్ కుమార్తె సాత్వికప్రభుత్వ ఆశ్రమ కళాశాలలో చదువుతూ గత మార్చి లో బైపిసి ప్రథమ సంవత్సరం 440 కి 436 సాధించి, స్టేట్ ర్యాంకర్ గా నిలిచింది. అందుకుగాను కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ సుజాత సోమవారం వారి కార్యాలయంలో సాత్వికను శాలువాతో సత్కరించి అభినందించారు.ఇదే విధంగా శ్రద్ధగా చదివి వైద్య రంగంలో రాణించాలని.నీట్ కోసం ప్రత్యేక శిక్షణకు అయ్యే ఖర్చును తాను అందిస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో మేనేజర్ ప్రసాద్ బాబు, సానిటరీ ఇన్స్పెక్టర్ అహ్మద్, ఎన్విరాన్మెంట్ ఇంజనీర్ వీరభద్ర చారి,చావా రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న ట్రాఫిక్ ఎస్సై గడ్డం ప్రవీణ్




**కొత్తగూడెం,అక్టోబర్ 6(ప్రజాజ్యోతి ):** కొత్తగూడెం బస్టాండ్ ప్రాంతంలోని ఆర్టీసీ బంక్ వద్ద సోమవారం జరిగిన ద్విచక్రవాహన ప్రమాదంలో ఖలీల్ పాషా అనే వ్యక్తి తీవ్ర గాయాల పాలయ్యాడు. అదే సమయంలో అటుగా వెళ్తున్న ట్రాఫిక్ ఎస్సై గడ్డం ప్రవీణ్ కుమార్ తక్షణమే స్పందించి గాయాల పాలైన వ్యక్తిని తన వాహనంలో ఆస్పత్రికి తీసుకుని వెళ్లి అక్కడ ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు ప్రమాదం గురించి సమాచారం అందించారు. మానవత్వంతో స్పందించి దగ్గరుండి ఆసుపత్రికి తరలించిన ఎస్సై ప్రవీణ్ కుమార్ ను పలువురు అభినందించారు.

## తల్లిదండ్రులను ఇంటి నుంచి గెంటేసిన కుమారుడు

- రాత్రంతా రోడ్డుపై ఉండటంతో చేరదీసిన స్థానికులు
- రోడ్డుపై తన్నుతూ, దుర్భాషలాడిన వైనం



**భద్రాచలం, అక్టోబరు 6, ప్రజా జ్యోతి:** భద్రాచలంలోని సుభాష్ నగర్ కాలనీలో ఓ వ్యక్తి నవ మాసాలు కని పెంచిన తల్లిదండ్రులను మద్యం మత్తులో ఇంటి ముందే రోడ్డుపై పడేసి కొట్టి బయటకు గెంటడంతో దిక్కుతోచని స్థితిలో రోడ్డుపైనే ఉండిపోయారు. దీంతో ఉదయం సమయంలో గమనించిన స్థానికులు వారిని చేరదీయగా మళ్లీ వారిని సైతం దుర్భాషలాడుతూ కొట్టేందుకు ప్రయత్నించిన సంఘటన ఇది.సుబాష్ నగర్ కాలనీలో సొంతింటిలో నివాసం ఉంటున్న వనచర్ల రాంబాబు, మంగాదేవితో పాటు ఆమె కుమారుడు వెంకటేష్, కూతురు తో కలిసి ఉంటున్నారు. కాగా కుమారుడు వెంకటేష్ మద్యంకు బానిసై తల్లిదండ్రులను తరచూ ఇబ్బందులకు గురి చేస్తుంటాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి తల్లిదండ్రులతో వాదనకు దిగి ఘర్షణ చోటు చేసుకోవడంతో తల్లిదండ్రులు రాంబాబు మంగాదేవిలను ఇంట్లో ఉండొద్దని ఇంటి నుంచి బయటకు గెంటడంతో పాటు రోడ్డుపైనే కొట్టాడు. రాత్రంతా వారు ఇంటి ముందే ఉండగా గమనించిన స్థానికులు వీరిని చేరదీసారు. దీనిని గమనించిన వెంకటేష్ మళ్లీ తల్లిదండ్రులు, ఆశ్రయం ఇచ్చిన వారిపైన దాడికి దిగడంతో ఈ విషయంపై కూతురు పోలీసులను ఆశ్రయించింది. వారు కుమారుడుని స్టేషన్కు పిలిపించి విచారిస్తామని చెప్పినట్లు సమాచారం.

## సగం జీతం వచ్చినా నోరుమూసుకొని పని చేయాలి

- రాష్ట్రమంతా పాత పద్ధతిలో జీతాలు చెల్లింపు.. భద్రాచలం ఐటీడీఏలో జీతాల
- భారీ తగ్గింపు
- ద్వంద విధానాలతో గిరిజన కార్మికుల పొట్టకొట్టకండి
- కలెక్టర్ గెజిట్ ప్రకారం పాత జీతమే చెల్లించాలి ఐటీడీఏ ఎదుట హాస్టల్ డైలీవేజ్ కార్మికుల మెరుపు ధర్నా రాత్రైనా ఇక్కడే ధర్నా చేస్తాం



**భద్రాచలం, అక్టోబరు 6, ప్రజా జ్యోతి:** గత 20 రోజులుగా సమ్మె చేస్తున్న పట్టించుకోకుండా హాస్టల్ డైలీవేజ్ కార్మికుల జీతం తగ్గించి వేయడం పట్ల ఆగ్రహించిన కార్మికులు భద్రాచలం ఐటీడీఏ ఎదుట సోమవారం ఉదయం నుంచి మెరుపు ధర్నాకు దిగారు. ఏటూరునాగారం, ఉట్నూరు ఐటీడీఏలతో పాటు రాష్ట్రం మొత్తం పాత పద్ధతిలోనే జిల్లా కల్టెరు గెజిట్ ప్రకారం జీతాలు చెల్లించినప్పటికీ భద్రాచలం ఐటీడీఏ పరిధిలో మాత్రం జీతాలు తగ్గించి కలెక్టర్ గెజిట్ను విస్మరించి కార్మికులు పొట్టగొట్టారని డైలీవేజ్ కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గిరిజన సంక్షేమ శాఖలో ద్వంద విధానాలు అమలు చేస్తున్నారని దీని వల్ల జిల్లాలో ప్రతి కార్మికుడు నెలకు రూ.18 వేలు నష్టపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే 25 రోజులుగా సమ్మె చేస్తున్న వర్కర్ల జీతాలు తగ్గించి వేయడంతో ఆగ్రహించి సోమవారం ఉదయం నుంచి ఐటీడీఏ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు సీఐటీయు జిల్లా అధ్యక్షులు కె. బ్రహ్మాచారి, బి. నాగేశ్వరారవులు మాట్లాడుతూ ఇతర జిల్లాల లాగానే భద్రాచలం ఐటీడీఏ పరిధిలో కార్మికులు కూడా పాత పద్ధతిలోనే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఒకే డిపార్టుమెంటులో పని చేస్తున్న కార్మికులకు రెండు రకాల జీతాలు చెల్లించడం ఏమిటని ప్రశ్నించారు. కార్మికులకు నెలల తరబడి జీతాలు రాకపోయినా వచ్చే జీతం సగానికి సగం తగ్గించినా కార్మికులు నూరు మూసుకొని పని చేయాలని అధికారులు ప్రభుత్వం, చెప్పడం అన్యాయమని అన్నారు. డైలీవేజ్ వర్కర్లకు ఇతర ఐటీడీఏల్లో వేసినట్లు ఇక్కడ కూడా పాత జీతమే కలెక్టరు గెజిట్ ప్రకారం చెల్లించకుంటే ధర్నా యధావిధిగా రాత్రిపూట కొనసాగుతుందని పేర్కొన్నారు. ఔట్సోర్సింగ్ కార్మికులకు రూ.15,800 చెల్లించాలని డిమాండ్ చేశారు. జేఏసీ నాయకులతో డీడీ అశోక్ కుమార్ చర్చించారు. తమ సమస్యల పరిష్కారం చేస్తే తప్ప తాము పోరాటం ఆపేది లేదని పేర్కొన్నారు. దీంతో సమస్యను ఐటీడీఏ పీవో తో చర్చిస్తామని చెప్పారు. ఉదయం ప్రారంభమైన ధర్నా సాయంత్రం దాటినా కొనసాగుతూనే ఉంది. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు హీరాలాల్, కౌశల్య, మంగీలాల్, ముత్తయ్య, జలంధర్, స్వామి, మంగ, నర్సింహారావు, స్వరూప, తిరుపతమ్మ, జీవా, సమ్మక్కతో పాటు ఉమ్మడి జిల్లా వర్కర్లందరూ పాల్గొన్నారు.

## అమ్మ దయ ఉంటే అంతా శుభమే జరుగుతుంది

- బొల్లేరు గూడెంలో అమ్మవారి మహా అన్నదానం.



**పాల్వంచ(రూరల్ ),అక్టోబర్ 06,ప్రజా జ్యోతి:** అమ్మ దయ ఉంటే జీవితంలో అన్ని శుభకార్యాలు సాఫల్యమవుతుంది,పాల్వంచ మున్సిపాలిటీ పరిధిలోని బొల్లేరు గూడెం భద్రకాళి యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ దేవి శరన్నవ రాత్రి మహోత్సవాల ముగింపు సందర్భంగా సోమవారం జరిగిన అన్నదాన కార్యక్రమంలో నిర్భహించారు.అమ్మవారి ఆశీస్సులు మనపై ఉంటే ప్రతి పని విజయవంతమవుతుంది.శరన్నవరాత్రి పర్వదినాల్లో భాగంగా నిర్వహించిన ఈ పవిత్రమైన అన్నదానం కార్యక్రమం ఎంతో పుణ్యప్రదమైనది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్సవాల నిర్వాహకులుకొత్వాల శ్రీనివాసరావు,పత్యం సురేష్, సింగారపు రమేష్,సత్తెనపల్లి శ్రీనాథ్, ఇమ్మడి సాయికుమార్ బ్రదర్స్, బాడిషా శంకరరావు,మాజీ జడ్పీటీసీ ఎర్రంశెట్టి ముత్తయ్య,మండల కాంగ్రెస్ అధ్యక్షులు కొండం వెంకన్న,ధర్మసోత్ ఉపేందర్ నాయక్,శనగ రామచందర్, అశ్విన్,సమ్మిడి జనార్దన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బోటుగూడెం లో తాగునీటి సమస్యను తీర్చిన ఎంపీఓ



**పినపాక,అక్టోబర్ 06(ప్రజాజ్యోతి ):** మిషన్ భగీరథ పైప్లైన్ సమస్యతో తాగు నీటి కోసం ఇబ్బంది పడుతున్న బోటిగుడెం వాసుల సమస్యపై పినపాక ఎంపీఓ తక్షణమే స్పందించారు. సోమవారం పినపాక మండలం బోటిగుడెం గ్రామ పంచాయతీ పరిధిలో తాగునీటి సమస్య ఉందని స్థానిక కాంగ్రెస్ నాయకులు కొండేరు సంపత్ తెలపగానే ఎంపీఓ వెంకటేశ్వరరావు తక్షణమే ఆ ప్రాంతాన్ని సందర్శించారు. రెండు మూడు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అప్పటిదాకా పంచాయతీ ట్రాక్టర్ల తో నీటిని అందిస్తామని ఆయన తెలియజేశారు. పంచాయతీ ట్రాక్టర్ ద్వారా తాగునీటిని సమస్య లేకుండా చూడాలని స్థానిక సెక్రటరీ జ్యోతిని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎంపిఒకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియజేశారు. సమస్య తెలిసిన వెంటనే స్పందించటం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు

## ముత్తంగి అలంకారంలో దర్శనమిచ్చిన భద్రాద్రి రామయ్య



**భద్రాచలం, అక్టోబరు 6, ప్రజా జ్యోతి:** భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి వారు సోమవారం ముత్తంగి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ముత్యాలతో అలంకరించిన స్వామి వారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అలాగే నిత్య కల్యాణ మండపంలో శ్రీ సీతారామచంద్రస్వామి వారికి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. విశ్వక్సేనార్చన, పుణ్యహావచనం, కంకణ ధారణ, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, వేద ఆశీర్వచనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైదిక, పరిపాలన సిబ్బంది పాల్గొన్నారు.

## ఎన్నికల కోడ్ ముగియనే గిరిజనులు అందజేసిన దరఖాస్తులను పరిష్కరిస్తాం

- ఐటీడీఏ ఏపీవో జనరల్ డేవిడ్ రాజ్



**భద్రాచలం, అక్టోబరు 6, ప్రజా జ్యోతి:** ఎన్నికల కోడ్ ముగియగానే గిరిజన దర్బార్లో గిరిజనులు వివిధ సమస్యలపై అందజేసిన సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని భద్రాచలం ఐటీడీఏ ఏపీవో జనరల్ డేవిడ్ రాజు పేర్కొన్నారు. భద్రాచలంలో సోమవారం ఐటీడీఏ కార్యాలయంలో గిరిజన దర్బార్ నిర్వహించారు.గిరిజనుల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సబ్సిడీపై కరరెంటు, బోరు, మోటార్ల కోసం పోడు భూమలు పట్టాలు, అసైన్డ్ చేయించేందుకు, స్వయం ఉపాధి, భూ సమస్యలు, వ్యక్తిగత రుణాలు, గ్రామాల్లో వ్యవసాయం చేసుకునేందుకు బోరు మోటార్లు ఇప్పించుట గురించి సోలార్ విద్యుత్తు సరఫరా ఇప్పించుట కోసం ఎక్కువగా దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు.ఏపీవో పవర్ వేణు, కొండరెడ్ల విభాగం అధికారి రాజారావు, డీటీఆర్వోఎస్ఆర్ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

## పేదల ఆరోగ్య రక్షణ కోసం వైద్య శిబిరాలు

- పలు గ్రామాల్లో వైద్యశిబిరాల నిర్వహణ



**టేకులపల్లి,అక్టోబర్06,ప్రజాజ్యోతి:** స్థానిక వైద్యాధికారి డాక్టర్ కందుల దినేష్ ఆదేశానుసారం సోమవారం మండలంలోని ఆర్ సి పేట, గంగారం,సంపత్ నగర్, సింగ్యాతండా,గోలియా తండా ల గ్రామాలలో వైద్య సిబ్బందిచే,వైద్య శిబిరాలు నిర్వహించి ప్రజలకు అవసరమైన చికిత్సలను అందజేయడం జరిగింది.ఈ వైద్య శిబిరాలలో ప్రజలకు మలేరియా,డెంగ్యూ, షుగర్, బీపీ టెస్టులు నిర్వహించారు. గ్రామాలలో జ్వరంతో బాధపడుతున్న బాధితులకు చికిత్స చేసి వారికి మందులను ఇవ్వడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి దేవ, మల్టీ లెవెల్ హెల్త్ ప్రొవైడర్ రుక్సాన, ధరణి,అమూల్య, వీరభద్రమ్మ, లక్ష్మీబాయ్, ఆశా కార్యకర్త రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# దూరప్రాంతాలకు లేని ఆర్టీసీ బస్సులు

- ఇక్కట్లు పడుతున్న మండలవాసులు
- జోరుగా ప్రైవేటు ట్రావెల్స్
- జిల్లా కేంద్రానికి నేరుగా లేని ఆర్టీసీ బస్సు సౌకర్యం
- ఏజెన్సీ అభివృద్ధి అయ్యేది ఎప్పుడు ?
- వాగ్దానాలతో సరిపెడుతున్న ఆర్టీసీ అధికారులు
- దృష్టి సారించని ఆర్టీసీ అధికారులు






**చర్ల, అక్టోబర్ 06: (ప్రజా జ్యోతి ):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం లో మండల వాసులకు దూర ప్రాంతాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేక నానా అవస్థలు పడుతున్నారు. భద్రాచలం డివిజన్లో భద్రాచలం తర్వాత అత్యంత పెద్ద బస్టాండ్ కలిగిన మండలం ఏదైనా ఉన్నది అంటే అది చర్ల మండలం ఒకటే కానీ చర్ల మండలం నుంచి దూర ప్రాంతాలు ఇన విజయవాడకు, హైదరాబాదుకు, రాజమండ్రి కి, గుంటూరుకు, ఆర్టీసీ బస్సుల సౌకర్యం లేక మండల వాసు అనేక ఇబ్బందులకు గురిఅవుతున్నారు. గతంలో ఉమ్మడి రాష్ట్రములో ఉన్నప్పుడు చర్ల మండలం నుంచి గుంటూరు,విజయవాడకి,బాపట్లకు , ఖమ్మంకు నేరుగా చర్ల నుండి బస్సు సౌకర్యాలు ఉండేవని తరువాత రాష్ట్ర విభజన అనంతరం చర్ల మండలం నుంచి దూర ప్రాంతాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యాలని తొలగించారని మండల వాసులు అంటున్నారు . అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా ఎన్నిసార్లు వినతిపత్రాలు ఇచ్చిన చర్ల నుంచి దూర ప్రాంతాలకు బస్సు సౌకర్యాలు ఏర్పాటు చేయడం లేదని అంటున్నారు. ప్రభుత్వాలు మారినా పాలకులు మారినా చర్ల మండలంలోని ఏజెన్సీ ప్రాంత ప్రజలకు దూరప్రాంతాలకు వెళ్లే ఆర్టీసీ బస్సు సౌకర్యం అందడంలేదని అంటున్నారు . ఒక వైపు చర్ల మండలం నుండి ప్రైవేట్ ట్రావెల్స్ నిత్యం పదుల సంఖ్యలో చర్ల నుండి హైదరాబాద్ కు బస్సులను నడుపుతూఉంటే కనీసం ఒక్క ఆర్టీసీ బస్సు కూడా చర్ల మండలం నుంచి హైదరాబాదుకి లేకపోవటం మండల వాసులకు ఇబ్బంది కలిగిస్తున్నది. భద్రాచలం డిపో అధికారులు ఎందుకు పట్టించుకోవటం లేదో అర్థం కావటం లేదని చర్ల మండల వాసులు అంటున్నారు. ఏజెన్సీ ప్రాంత ప్రజలు కేవలం పల్లె వెలుగు, ఆర్డినరీ బస్సులకే పరిమితం కావాలా అని ప్రశ్నిస్తున్నారు. ఆర్టీసీ వారి సూపర్ లగ్జరీ బస్సుల్లో,ఏసీ బస్సులలో మేము ప్రయాణించకూడదా అని మండల వాసులు అంటున్నారు .మాకు ఆ సౌకర్యాలు ఎందుకు కల్పించడం లేదు అని ఏజెన్సీ గ్రామ ప్రజలు ప్రశ్నిస్తున్నారు . నిత్యం పదుల సంఖ్యలో ప్రైవేటు వాహనాలు ఇష్టానుసారంగా రేట్లు పెంచుతూ చర్ల నుండి హైదరాబాదుకు బస్సు సౌకర్యం అందిస్తూ ఉండటం ,పక్క రాష్ట్రం ఐన ఛత్తీస్గడ్ కూడా చర్ల నుండి నేరుగా బీజాపూర్ కు బస్సు సౌకర్యం కలిపిస్తున్నాయి అని కానీ చర్ల మండలానికి భద్రాచలం డిపో వారు నేరుగా దూర ప్రాంతాలకు ఎందుకు బస్సు సౌకర్యం కల్పించడం లేదని అంటున్నారు . గతంలో ఉన్న డిపో మేనేజర్ ముందుగా విజయవాడ ,రాజమండ్రి, గుంటూరు కు చర్ల నుండి బస్సు సౌకర్యం ఏర్పాటు చేసే విధంగా చర్యలు చేపడతామని వాగ్దానం చేసినప్పటికీ అది ఇంతవరకు నెరవేరలేదని అధికారులు మారుతున్నారు కానీ చర్ల మండల వాసుల కల తీరటంలేదని అంటున్నారు .ఏ చిన్న అవసరం వచ్చిన దూరప్రాంతాలకు ప్రైవేటు ట్రావెల్స్ లో కానీ భద్రాచలం కానీ వెళ్లి బస్సులు ఎక్కవలసి వస్తుందని చర్ల మండలం వ్యవసాయ ఆధారిత ప్రాంతం కావడంతో ఇక్కడ మండల వాసులు మిర్చి, పొగాకు ,వరి ,పత్తి మొదలైన పంటలను పండిస్తూ మెరుగైన ధర కోసం గుంటూరు ,విజయవాడ , కోల్డ్ స్టోరేజ్ ల కోసం నిత్యం చర్ల మండలం నుంచి ప్రయాణం సాగిస్తూ ఉంటారని అదే చర్ల మండలం నుంచి నేరుగా గుంటూరుకు, విజయవాడకు బస్సు సౌకర్యం ఉన్నట్లయితే సమయం వృధా కాకుండా పని ముగించుకుని చర్ల కి తిరిగి రావచ్చని రైతులు ,వ్యాపారస్తులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నత చదువులు నిమిత్తం మండలంలోని చాలామంది పిల్లలు పక్క రాష్ట్రంలో ఉన్న విజయవాడ, గుంటూరు, మన రాష్ట్రంలో ఉన్న హైదరాబాదులోని విద్యాసంస్థల్లో చదువుకుంటున్నారని నేరుగా చర్ల నుండి దూర ప్రాంతాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం ఉన్నట్లయితే వాళ్ళు నేరుగా అక్కడ నుండి చర్లకి వచ్చే అవకాశం ఉంటుందని ప్రవైట్ ట్రావెల్స్ ఒక్కోసారి ఒక్కొక రేట్ పెట్టటం వలన మండల వాసులు ఇబ్బందికి పడుతున్నారు అని అదే ఆర్టీసీ బస్సు సౌకర్యం చర్ల మండలం నుంచి హైదరాబాదుకు నేరుగా ఉన్నట్లయితే టికెట్ రేటులో ఎటువంటి వ్యత్యాసం లేకుండా ప్రభుత్వం నిర్ణయుంచిన రేటుకి ప్రయాణం చేయవచ్చునని అంటున్నారు . అత్యవసర వైద్య నిమిత్తం గుంటూరు, విజయవాడ, ఖమ్మం, హైదరాబాద్ వెళ్లవలసిన పరిస్థితి కూడా ఉంటుందని .చర్ల మండలం నుంచి జిల్లా కేంద్రమయిన కొత్తగూడెం కి నేరుగా ఒక్క బస్సు సర్వీస్ లేకపోవడం శోచనీయమని జిల్లాలోని అధికారులు కలిసే క్రమంలో ప్రతి ఒక్కరూ భద్రాచలం వెళ్లి జిల్లా కేంద్రానికి బస్సు ఎక్కవలసి వస్తుందని అదే జిల్లా కేంద్రానికి నేరుగా బస్సు సౌకర్యం అందుబాటులో ఉంటే సమయం వృధా కాకుండా ఉంటుందని మండల వాసులు అంటున్నారు .దూరప్రాంతాలకు బస్సులు అందుబాటులో ఉన్నట్లయితే వైద్యం నిమిత్తం వెళ్లే ప్రజలు తొందరగా తమ పని ముగించుకొని చర్ల కి రావచ్చు అని అంటున్నారు .భద్రాచలం శాసన సభ్యులు డాక్టర్ తెల్లం వెంకటరావు ,రాజకీయ నాయకులు, భద్రాచలం డిపో మేనేజర్ చొరవ తీసుకొని చర్ల మండలం నుంచి దూర ప్రాంతాలకు బస్సు సౌకర్యాలు కల్పించే విధంగా ప్రయత్నాలు చేసి మండల వాసులు పడుతున్న ఇబ్బందులను తొలగించాలని అందరు కోరుకుంటున్నారు.

## ఈ రోజు పెద్దమ్మగుడిలో చండీహోమం



**పాల్వంచ(రూరల్),అక్టోబర్ 06, ప్రజా జ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం కేశవాపురం–జగన్నాధపురం గ్రామాలలో వెలసి ఉన్న శ్రీ కనకదుర్గ దేవస్థానము (పెద్దమ్మగుడి)లో పౌర్ణమి సందర్భంగా చండీహోమం ఈ రోజు మంగళవారం(తేది:అక్టోబర్ 07,2025) న జరగనుంది.ఈ చండీహోమంలో పాల్గొనే భక్తులకు అమ్మవారి ఆశీస్సులతో ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, సుఖసంతోషాలు కలుగుతాయని వేదాలు సూచిస్తున్నాయని తెలిపారు.సమృద్ధి కలుగుతుందనే విశ్వాసంతో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. భక్తులు హోమం రోజు రూ.2,516/– చెల్లించి టికెట్ పొంది, తమ గోత్రనామములు నమోదు చేసుకోవాలి.హోమంలో పాల్గొన్న దంపతులకు శేష వస్త్రప్రసాదములు, ఉచిత అన్నప్రసాదం ఏర్పాటు చేయబడింది.ప్రత్యక్షంగా పాల్గొనలేని భక్తుల పేర సంకల్పం చేసి హోమం నిర్వహించబడుతుంది.భక్తులు సాంప్రదాయ దుస్తులు ధరించి హోమంలో పాల్గొనాలని సూచించారు.

## ఏసీపీ విష్ణుమూర్తి భౌతిక కాయానికి నివాళులు



**జూలూరుపాడు అక్టోబర్ 6( ప్రజా జ్యోతి) :** జూలూరుపాడు మండల వాసి ACP సబ్బతి విష్ణుమూర్తి నిన్నరాత్రి గుండెపోటుతో మరణించాగా విషయం తెలుసుకొని హైదరాబాదులో వారి స్వగృహానికి వెళ్లి వారి పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన వైరా నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ నాయకులు లకావత్ గిరిబాబు విష్ణుమూర్తి గారి మృతి వారి కుటుంబానికి తీరని లోటని కుటుంబ సభ్యులను ఓదార్చి వారి ఆత్మకు శాంతి చేకూరాలని దేవుణ్ణి ప్రార్థించారు.

# బిజెపిని వ్యతిరేకించే పార్టీలతో పొత్తుకు సిద్ధం

- బలమైన స్థానాల్లో సిపిఎం ఒంటరిగా పోటీ



**చర్ల, అక్టోబర్ 06 (ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో సోమవారం బి ఎస్ రామయ్య భవన్ లో సి పీ ఏం మండల కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కొలగాని బ్రహ్మచారి,రే పాకుల శ్రీనివాస్ మాట్లాడుతూ బిజెపికి వ్యతిరేకంగా కలిసివచ్చే వామపక్ష ప్రజాతంత్ర లౌకిక పార్టీలతో స్థానిక ఎన్నికల అవగాహన కుదుర్చుకుంటామని వెల్లడించారు. ప్రస్తుతం స్థానిక ఎన్నికల నోటిఫికేషన్ కొంత గందరగోళంగా ఉందని అయినప్పటికీ ఎన్నికల కమిషన్ ఇచ్చిన షెడ్యూల్ ఆధారంగా ఎన్నికలకు సిద్ధమవుతున్నట్లు తెలియజేశారు. ఎంపీటీసీ, జడ్పిటిసి సర్పంచ్ బీసీ రిజర్వేషన్ అంశం కోర్టులో ఉన్నప్పటికీ తీర్పు వెల్లడయ్యే సందర్భంలో ప్రభుత్వం ఎన్నికలు నిర్వహిస్తే ఎన్నికలకు తాము సిద్దంగా ఉన్నామని తెలియజేశారు.బీజేపీనీ ఓడించడానికి కలిసి వచ్చే పార్టీలతో పొత్తు పెట్టుకుని స్థానిక ఎన్నికల్లో ముందుకు వెళ్తామని అన్నారు.బీజేపీ తో అధికార భాగస్వామిగా ఉన్న ఏ పార్టీతో కూడా పొత్తు ఉండదని స్పష్టం చేశారు.చర్ల మండలం లో 13 సర్పంచ్, 8 ఎంపీటీసీస్థానాలు, జడ్పీటీసీ స్థానం పోటీ చేయాలని అనుకుంటున్నామని ఈ ప్రతిపాదనకు ఒప్పుకునే పార్టీతో కలిసి పోటీ చేస్తామని లేకుంటే తమకు బలం ఉన్న స్థానాల్లో ఒంటరిగా పోటీ చేస్తామని ఆయన తెలిపారు. పొత్తు ఉన్న లేకున్న సిపిఎం బలంగా ఉన్న స్థానా ల్లో పోటీ చేస్తుందని పార్టీ విధానం ప్రజల్లోకి తీసుకెళ్లడానికి ఈ ఎన్నికలను సాధనంగా ఉపయోగించుకోనున్నట్లు తెలియజేశారు. గతంలో సిపిఎం గెలిచిన స్థానిక సంస్థలను ఆదర్శంగా తీర్చిద్దామని ఆదర్శ గ్రామపంచాయతీల అవార్డులు కూడా పొందామని సిపిఎం అభ్యర్థులు గెలిచిన చోట సుపరిపాలన గ్రామాభివృద్ధి లక్ష్యంగా పరిపాలన ఉంటుందని అన్నారు .స్థానిక ఎన్నికలో గ్రామాల అభివృద్ధికి అంకితమై పని చేస్తున్న సిపిఎంకు పట్టం కట్టాలని ప్రజలకు పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో మండ ల కార్యదర్శి మచ్చ రామారావు, మండల కమిటీ సభ్యులు కారం నరేష్, తాటి నాగమణి, పి.సమ్మక్క,బందెల చంటి, దొడ్డి హరి నాగవర్మ, శ్యామల చంద్రం, వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

## 28 ఏళ్ల తర్వాత తల్లిదండ్రుల చెంతకు కొడుకు



**టేకులపల్లి,అక్టోబర్06,ప్రజాజ్యోతి:** తల్లిదండ్రులు మందలించారని ఇంటి నుంచి పారిపోయిన బాలుడు 28 ఏళ్ల తర్వాత తల్లిదండ్రుల చెంతకు చేరిన సంఘటన మండలంలో చోటుచేసుకుంది. టేకులపల్లి మండలం మంగళ్ తండాకు చెందిన లాకావత్ పంతులు నాతి దంపతుల రెండో కుమారుడైన హరి 1997 వ సంవత్సరంలో ఆరో తరగతి పూర్తి చేసుకుని వేసవి సెలవుల్లో తల్లిదండ్రుల వద్దకు వచ్చాడు. తల్లిదండ్రులు మందలించడంతో భయపడి ఇంటి నుంచి పారిపోయాడు. కొత్తగూడెం భద్రాచలం ఖమ్మం కోదాడ ప్రాంతాలలో హోటల్లో పనిచేసి చివరకు హైదరాబాద్ చేరాడు. బేగంపేటలో ఓ ఇల్లు అద్దెకు తీసుకొని ఉంటూ హోటల్లో పనిచేస్తూ జీవనం సాగించాడు.2010లో ఓ అమ్మాయిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు.ప్రస్తుతం హరికి ఒక పాప ఒక బాబు ఉన్నారు.తల్లిదండ్రులను చూడాలని వాళ్లతో గడపాలని ఆశ కలగడంతో రెండు రోజుల క్రితమే స్వగ్రామమైన మంగళ తండాకు వచ్చి తల్లిదండ్రులను తోడబుట్టిన వాళ్లను కలుసుకున్నాడు.వారితో ప్రేమ అనుబంధాలను పంచుకున్నాడు.

## అక్రమంగా రవాణా చేస్తున్న పశువులు పట్టివేత

**బూర్గంపహాడ్,అక్టోబర్ 6, (ప్రజా జ్యోతి ):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపహాడ్ మండలం జింకల గూడెం గ్రామం నుంచి సోమవారం తెల్లవారుజామున అక్రమంగా రవాణా చేస్తున్న 32 పశువులను బూర్గంపహాడ్ పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ మేడా ప్రసాద్ తెలిపిన వివరాల మేరకు జింకలగూడెం గ్రామం నుంచి హైదరాబాద్ కబేళాలకు లారీలో 32 పశువులు అక్రమంగా రవాణా చేస్తున్న లారీని అదనపు ఎస్ఐ నాగభిక్షం పట్టుకున్నట్లు చెప్పారు. ఈ కేసులో ఇద్దరిని అరెస్ట్ చేశామని లారీ డ్రైవర్ పరారీలో ఉన్నాడని,లారీని సీజ్ చేసినట్లు ఎస్ఐ మేడా ప్రసాద్ తెలిపారు. పట్టుబడిన పశువులను పాల్వంచ గోశాలకు తరలించారు.

## చెరువులో పడి చిన్నారి మృతి





**టేకులపల్లి,అక్టోబర్06,ప్రజాజ్యోతి:** ప్రమాదవశాత్తు చెరువులో పడి లకావత్ వర్షిత(14) మృతిచెందిన సంఘటన టేకులపల్లి మండలంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం ఉదయం లకావత్ వర్షిత, మేఘా, జశ్విత శ్రీ లు తెల్లవారు చెరువు వద్దకు ఆడుకోవడానికి వెళ్లారన్నారు. వారు ఆడుకుంటుండగా ప్రమాదవశాత్తు లకావత్ వర్షిత చెరువులోకి జారిపోవడం జరిగిందని తెలిపారు. ఈ విషయాన్ని మేఘ, జస్విత శ్రీ లు భయభ్రాంతులకు గురై ఎవరికి చెప్పకుండా ఇంటికి వచ్చారని, సాయంత్రం సమయంలో వర్షిత ఇంటికి రాకపోయేసరికి తల్లిదండ్రులు వెతుకుతూ మిగిలిన ఇద్దరు బాలికలను అడగగా వర్షిత చెరువులకు జారీ పడిపోయిందని వారు చెప్పారన్నారు. జేత్యా తండా గ్రామస్తులు, యువకులు చెరువులో సుమారు ఒక గంటపాటు వెతకగా హరి అనే యువకుడు చాకచక్యంగా ఆ బాలిక మృతదేహాన్ని బయటకి తీసుకొచ్చారని తెలిపారు.స్థానికులు ఎస్ ఐ ఆలకుంట రాజేందర్ కు సమాచారం ఇవ్వగా బాలిక లకావత్ వర్షిత స్వగృహానికి వచ్చి ఘటన వివరాలు తెలుసుకున్నారు.టేకులపల్లి ఎస్ ఐ అలకుంట రాజేందర్ మాట్లాడుతూ పిల్లలు తెలిసి తెలియని వయసులో ప్రమాదం పొంచి ఉన్న ప్రాంతాలకు వెళ్లి ఆటలు ఆడుకుంటూ ప్రమాదలకు గురువుతున్నారు.తల్లి తండ్రులు ఇలాంటి విషయాల పై అప్రమత్తంగా ఉండాలి పిల్లలపైన ఓ కన్నేసి ఉంచాలి.పిల్లలకు అవగాహన కల్పించాలి. అలాగే ఎవరి పిల్లల బాధ్యత వారి తల్లిదండ్రులదే అని ఎస్ ఐ తెలిపారు.

## అన్నపురెడ్డిపల్లి మండలంలో పారదర్శక ఎన్నికల నిర్వహణకు అధికారులు సన్నద్ధం



**అన్నపురెడ్డిపల్లి, అక్టోబర్ 6,జ్యోతి:** అన్నపురెడ్డిపల్లి మండల వ్యాప్తంగా జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలను నిష్పాక్షికంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) మహాలక్ష్మి తెలిపారు. సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సన్నాహక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, అన్నపురెడ్డిపల్లి మండల పరిధిలో మొత్తం 16,932 మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. మండలంలో 1 జెడ్పీటీసీ, 6 ఎంపీటీసీ స్థానాలకు రెండవ విడతలో అక్టోబర్ 23న పోలింగ్ జరగనుందని వివరించారు. ఇందుకోసం మొత్తం 31 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.ఎంపీడీవో మహాలక్ష్మి మాట్లాడుతూ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల అనంతరం గ్రామపంచాయతీ ఎన్నికలు సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలు జరగనున్నాయని తెలిపారు. ఎన్నికల ఆచరణ నియమావళి అమల్లోకి వచ్చిన నేపథ్యంలో అధికారులు ఏ రాజకీయ కార్యక్రమాల్లో పాల్గొనరని స్పష్టం చేశారు.ప్రభుత్వ కార్యాలయాలు, బస్టాండ్లు, పబ్లిక్ ప్రదేశాల్లో ఉన్న రాజకీయ పార్టీ ఫొటోలు, హోర్డింగులు, బ్యానర్లు, స్టిక్కర్లు తొలగించామని ఆమె వివరించారు. ఓటర్లను ప్రభావితం చేసేలా గోడలపై రాసిన నినాదాలను కూడా చెరిపివేశామని తెలిపారు.పంచాయతీ ఎన్నికల షెడ్యూల్ ప్రకారం అక్టోబర్ 21 నుంచి 23 వరకు నామపత్రాల స్వీకరణ, 24న పరిశీలన, 27న ఉపసంహరణ ఉంటుందని పేర్కొన్నారు. నవంబర్ 4న పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి. అదే రోజు మధ్యాహ్నం రెండు గంటలకు ఓట్ల లెక్కింపు నిర్వహించబడుతుందని వివరించారు.మండల పరిధిలోని 10 గ్రామపంచాయతీలలో సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిర్వహించాలన్నారు. అన్ని అధికారులతో సమన్వయం చేసుకొని అన్నపురెడ్డిపల్లి మండలం జిల్లాలో ఆదర్శంగా నిలవాలని మహాలక్ష్మి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మహాలక్ష్మి, డీటీ జగదీశ్వరి, ఎంపీఓ సభన, వివిధ పార్టీ రాజకీయ నాయకులు, గ్రామ పెద్దలు, విలేకరులు పాల్గొన్నారు.

## నూతన ఏటిడిఓ గా భారతి దేవీ



**ఇల్లందు, అక్టోబర్ 6, ప్రజాజ్యోతి :** ఇల్లందు నూతన ఏటిడిఓగా యు. భారతి దేవి సోమవారం బా ధ్యతలను స్వీకరించారు. వైరా ఏటీడీఓ గా విధులు నిర్వహిస్తున్న భారతీదేవిని ఉన్నతాధికారులు ఇల్లందు ఏటిడిఓ గా బదిలీ చేశా రు. గతంలో భద్రాచలం, వెంకటాపురం, ఖమ్మం, వైరా లలో తాను విధులు నిర్వహించినట్లు భారతీదేవి తెలిపారు.

## గాజా ప్రజల పై దాడులకు నిరసన

- నేడు ఇల్లందులో జరుగుతున్న ప్రదర్శనను జయ ప్రదం చేయండి.
- పివైఎల్ రాష్ట్ర సహాయ కార్యదర్శి నోముల భానుచందర్ పిలుపు




**టేకులపల్లి,అక్టోబర్ 06, ప్రజాజ్యోతి:** గాజా పై ఇజ్రాయిల్, అమెరికా చేస్తున్నా జాతి హననానికి వ్యతిరేకంగా 7 న ఇల్లందు పట్టణంలో నిర్వహించే పాలస్తీనా సంఘీభావ ప్రదర్శన ను జయప్రదం చేయాలని ప్రగతిశీల యువజన సంఘం తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి నోముల భానుచందర్ యువతకు పెద్ద ఎత్తున పిలుపునిచ్చారు.టేకులపల్లి సిపిఐ ఎమ్మెల్యే న్యూ డెమోక్రసీ కార్యాలయంలో తోటకూరి సతీష్ ఆధ్వర్యంలో సోమవారం ముఖ్య కార్యకర్తల సమావేశంలో రాష్ట్ర సహాయ కార్యదర్శి నోముల బాను చందర్ పాల్గొన్ని మాట్లాడుతూ పాలస్తీనా దేశం తమ ప్రజల స్వతంత్రంగా ఏర్పాటు చేసుకున్నా పాలకులను,ఇజ్రాయిల్ ,అమెరికా హమాస్ ను ఉగ్రవాద సంస్థగా అభివర్ణిస్తున్నాయి.పాలస్తీనా ప్రజల సార్వభౌమత్వాని కాలరాస్తు హమస్ ను అంతం చేసి, శాంతి స్వరాజ్యన్ని స్థాపించాడం కోసమే ఈ యుద్ధం అని ఇజ్రాయిల్ తిర్మానిస్తుంది. పాలస్తీనా అథారిటీ, మాస్ లాంటి ఉగ్రవాద సంస్థ ప్రమేయం లేని శాంతియుత పరిపాలాన ను అందిస్తామన్న ఇజ్రాయిల్ చర్యలను అని దేశాలు తప్పు పడుతున్నాయి. భద్రత మండలి లో అమెరికా తీరును, నేతన్యాహు నిర్ణయాన్ని సభ్యదేశాలు వ్యతిరేకిస్తున్నాయి.అయినా ఇజ్రాయిల్, అమెరికా అండతో దాడులు కొనసాగిస్తుంది అని ఆయన అన్నారు. ఇప్పటికైనా గాజా ప్రజలపై దాడులు ఆపి వెంటనే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ గాజా ను విడిచిపెట్టి వెళ్లాలని కోరుతున్నాం అని ఈ సందర్భంగా ఆయనతెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్ష కార్యదర్శులు కొడేం. రవి, సమ్మయ్య, జార్జి, రామ, గవాస్కర్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిష్ట మహోత్సవంలో రేగ.



**గుండాల ప్రజా జ్యోతి. 6.** మహాలక్ష్మి అమ్మవారి ప్రాణ ప్రతిష్ట మహోత్సవంలో వేగ కాంతారావు పాల్గొన్నారు గుండాల మండల కేంద్రంలో సోమవారం మహాలక్ష్మి అమ్మవారి ప్రాణ ప్రతిష్ట తో పాటు ధ్వజస్తంభ ప్రతిష్ట కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పినపాక మాజీ శాసనసభ్యులు రేగా కాంతారావు పాల్గొన్నారు ఈ సందర్భంగా ఆలయ కమిటీతో పాటు గుడి నిర్మాణ దాత శాలువతో సన్మానించి సత్కరించారు ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు



# రిజర్వేషన్ కన్ఫ్యూజన్‌తో...
# ఎన్నికల కాలయాపన

- 42 శాతం బీసీ రిజర్వేషన్లపై సందిగ్ధత
- న్యాయస్థానాల తీర్పుపై ఉత్కంఠ
- ఆశావాహుల్లో కనరాని ఉత్సాహం
- అధికార యంత్రాంగం సిద్ధంగా ఉన్నా..
- రాజకీయ స్పష్టత లేని పరిస్థితి!?

**రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగాల్సిన సమయం చాలా దాటిపోయింది. మండల, జిల్లా ప్రజా పరిషత్ లు, గ్రామపంచాయతీలు వీటి పదవీకాలం ముగిసి సంవత్సరం దాటినా కూడా ఎన్నికల దిశగా ఎటువంటి స్పష్టత కనిపించడం లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండో సంవత్సరం చివరి దశలో ఉన్నా, స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయో అనే ప్రశ్నకు సమాధానం దొరకలేదు. ఈ అనిశ్చితికి ప్రధాన కారణం బీసీలకు కేటాయించిన 42 శాతం రిజర్వేషన్ల అంశమే అని చెప్పాలి. ప్రభుత్వ హడావిడి చేసి ఎన్నికల ప్రక్రియకు కమిషన్ తో తేదీలు నిర్ణయించిన.. రిజర్వేషన్ అంశంపై కోర్టులో పిటిషన్ ఉండడంతో ఎన్నికల కాలయాపన ఇంకా కొనసాగుతూనే ఉంది.**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి / అశ్వారావుపేట, ప్రజాజ్యోతి

### బీసీ రిజర్వేషన్లతో మొదలైన చర్చ..

రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చింది. ఆ హామీని నెరవేర్చాలన్న ఉద్దేశంతో ఆ ప్రక్రియను ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి, గవర్నర్ ఆమోదానికి పంపింది. కానీ గవర్నర్ ఆమోదం రాకుండానే ప్రభుత్వం జీవో జారీ చేస్తూ, స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని నిర్ణయించింది. దీంతో ఈ నిర్ణయం చుట్టూ పెద్ద వివాదం చెలరేగింది. సుప్రీం కోర్టు, హైకోర్టుల్లో పిటిషన్లు దాఖలయ్యాయి. 50 శాతం పరిమితిని అతిక్రమించారని, ఇది గత సుప్రీంకోర్టు తీర్పులకు విరుద్ధమని వాదిస్తూ పలు సంస్థలు, వ్యక్తులు న్యాయస్థానాలను ఆశ్రయించారు. కొందరు హైకోర్టులో, మరికొందరు సుప్రీంకోర్టులో పిటిషన్లు వేశారు. అయితే సుప్రీం కోర్టు ఇటీవల ఆ పిటిషన్ ను కొట్టివేసింది. ప్రస్తుతం హైకోర్టులో విచారణ కీలక దశలో ఉంది. ఈనెల 8న విచారణ జరిగే అవకాశం ఉండటంతో రాజకీయ వర్గాలు ఆతృతగా ఎదురు చూస్తున్నాయి. హైకోర్టు రిజర్వేషన్లు చెల్లవని చెప్పినట్లయితే ఎన్నికల ప్రక్రియకు తాత్కాలిక బ్రేక్ పడే అవకాశం ఉందని అంచనా. అయితే ప్రభుత్వం మాత్రం అన్ని ఏర్పాట్లు పూర్తి చేయమని అధికారులను ఆదేశించింది.

### రిజర్వేషన్ మార్పుతో కన్ఫ్యూజన్..

సాధారణంగా ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన వెంటనే గ్రామ, మండల స్థాయిలో ఉత్సాహం, సందడి మొదలవుతుంది. కానీ ఈసారి దృశ్యం పూర్తిగా భిన్నంగా ఉంది. ఎవరి గ్రామం ఏ కేటగిరీ కింద వస్తుందో తెలియక నేతల్లో అనిశ్చితి నెలకొంది. గత సంవత్సరం నుంచి ప్రజల్లో పట్టు సాధించేందుకు పలు కార్యకలాపాలు నిర్వహించిన ఆశావాహులు ఇప్పుడు కన్ఫ్యూజన్ లో చిక్కుకున్నారు. జనరల్ కేటగిరీగా భావించిన వారు బీసీ కేటగిరీలో పడగా, కొందరు బీసీ నేతలు ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల కిందకు వెళ్లారు. దీంతో చాలా మంది విసుగుచెందుతున్నారు. ఎవరి గ్రామం ఏ వర్గంలోకి వస్తుందో తెలియక,





అభ్యర్థులు దారితప్పినట్లున్నారు. ఈ రిజర్వేషన్ గందరగోళం కారణంగా గ్రామీణ రాజకీయ సమీకరణాలు పూర్తిగా మారిపోయాయి. పాత నేతలు నిరుత్సాహానికి గురవుతుండగా, కొత్త నాయకత్వం ముందుకు రాలేకపోతోంది. బీసీ రిజర్వేషన్లపై స్పష్టత రాకపోవడం వల్ల గ్రామాల నుంచి జిల్లా స్థాయి వరకు రాజకీయ వాతావరణం మసకబారిపోయింది. ఈ పరిస్థితుల వల్ల సామాజిక సమతుల్యత దెబ్బతింటోందని రాజకీయ విశ్లేషకుల అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

### అధికార యంత్రాంగం సిద్ధంగా ఉన్నా...

ఎన్నికల కమిషన్ ఈనెల 9న జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల తొలి విడత నోటిఫికేషన్ విడుదల చేయనున్నట్లు ప్రకటించింది. కానీ హైకోర్టు విచారణ 8న జరగనుండటంతో ఆ తీర్పుపైనే అన్నీ ఆధారపడి ఉన్నాయి. కోర్టు ప్రభుత్వం పక్షాన తీర్పు ఇస్తే ఎన్నికల ప్రక్రియ వెంటనే మొదలయ్యే అవకాశం ఉంది. లేకపోతే మరోసారి ఆలస్యం తప్పదు. అయితే ఎన్నికల నిర్వహణకు అధికారులు మాత్రం సన్నద్ధంగా ఉన్నారు. గ్రామీణ ఎన్నికలకు అవసరమైన సిబ్బంది జాబితాలు, పోలింగ్ కేంద్రాలు, రిజర్వేషన్ లేఅవుట్లు దాదాపుగా సిద్ధమయ్యాయి. కానీ రాజకీయ స్థాయిలో స్పష్టత లేకపోవడంతో యంత్రాంగం ఎదురుచూపుల్లోనే ఉంది.

### ప్రభుత్వం ఎటు దిశగా..?

ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వం రెండు మార్గాల మధ్య నిలబడి ఉంది. ఒక వైపు ఎన్నికలు త్వరగా జరిపి ప్రజాస్వామ్య పునరుద్ధరణ చేయాలనే ఒత్తిడి ఉంది. మరోవైపు కోర్టు తీర్పు ప్రతికూలంగా వస్తే, బీసీ రిజర్వేషన్ వ్యవహారంలో కొత్త సవాళ్లు ఎదురవుతాయి. అయితే స్థానిక సంస్థలే గ్రామీణ పాలనకు పునాది కావడంతో వాటి ఎన్నికలు ఆలస్యం అవడం ప్రజా సమస్యల పరిష్కారాన్ని ప్రభావితం చేస్తోంది. అభివృద్ధి పనులు పూర్తిగా నిలిచిపోయాయి. ప్రభుత్వం పై కూడా కొంత వ్యతిరేకత మొదలవుతోంది. గ్రామాల్లో కూడా చురుకైన రాజకీయ చర్చలు, అభ్యర్థుల కదలికలు కూడా చల్లబడిపోయాయి. ఈ నేపధ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా అందరి మనసులో ఇప్పుడు ఈ ప్రశ్నలే మేదులుతున్నాయి. నోటిఫికేషన్ వస్తుందా..? ఎన్నికలు జరుగుతాయా..? బీసీ రిజర్వేషన్ పై ప్రభుత్వం విజయవంతమవుతుందా..? లేక మళ్లీ కోర్టు గేట్ల దగ్గరే ఈ అంశం ఆగిపోతుందా..? ఈ ప్రశ్నలకు సమాధానం రేపటి హైకోర్టు తీర్పుతోనే వెలువడనుంది. అప్పటి వరకూ రాష్ట్ర రాజకీయాల్లో ఉత్కంఠ, ఆశ, అనుమానం కలగలిసిన కన్ఫ్యూజన్ తో..ఎన్నికల కాలయాపన కొనసాగుతూనే ఉంటుంది.

